సాక్షి ఆదిలాబాద్

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023

టెట్ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల నిర్వహించిన టెట్ జిల్లా ఫలితాలను డీఈవో ప్రణీత శుక్రవారం విడుదల చేశారు. పేపర్–1కు 7,221 మంది హాజరవగా, 2,573మందిఉత్తీర్ణత (35.63 శాతం) సాధించారు. పేపర్–2 మ్యాథమెటి క్స్‌లో 1,686 మంది హాజరవగా, 370 మంది ఉత్తీర్ణత (21.95శాతం) సాధించారు. సోషల్ విభాగంలో 1,269 మంది పరీక్షకు హాజరగా 156 మంది (12.29శాతం) ఉత్తీర్ణులయ్యారు.



ఎన్‌క్వాస్ బృందం సందర్శన

ఆదిలాబాద్‌రూరల్: యాపలగూడ సబ్‌సెంటర్‌ను ఎన్‌క్వాస్ బృందం శుక్రవారం సందర్శించింది. వైద్యసేవలు, స్వచ్ఛత వివరాలపై ఆరా తీసింది. బృందంలో వైద్యులు దావన్, రాజేశ్వర్, తదితరులున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు పదోన్నతులు



ఎస్‌ఈ వెంకట్‌రావుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఈఈలు మహావీర్, శైలేందర్

కైలాస్‌నగర్: జిల్లాలో పలువురు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో ప్రస్తుతం రీజినల్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగుతున్న వెంకట్‌రావును అదే పోస్టులో రెగ్యులర్ ఎస్‌ఈగా నియమించింది. అలాగే ఆదిలాబాద్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా కొనసాగుతున్న ఆర్.మహావీర్ అదే పోస్టులో ఇకపై రెగ్యులర్‌గా వ్యవహరించనున్నారు. ఇక ఆర్.శైలేందర్‌కు పదోన్నతి కల్పిస్తూ రీజనల్ కార్యాలయ ఈఈగా నియమించింది. ఈ సందర్భంగా ఎస్‌ఈ వెంకట్‌రావును ఈఈలు, రీజనల్ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ ఈఈ కార్యాలయంలో మహావీర్‌ను ఆ శాఖ సిబ్బంది సన్మానించారు.

ఆధార్ ప్రామాణీకరణతోనే పత్తి కొనుగోళ్లు

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో 2023–24 వానాకాలం సీజన్‌కు సంబంధించిన పత్తి కొనుగోళ్లు ఆధార్ ప్రామాణీకరణతోనే ఉంటాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. సీసీఐకి కనీస మద్దతు ధర రూ.7,020తో పత్తి విక్రయించే రైతులు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకుని ఉన్నట్లు రుజువు సమర్పించాలని పేర్కొన్నారు. వేలిముద్ర (బయోమెట్రిక్) విధానం ద్వారా ఆధార్ ప్రామాణీకరణ చేయించుకోవాలని సూచించారు. ఇందుకోసం పత్తి పంట కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రామాణీకరణ అయిన తర్వాతే పంట కొనుగోలు ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. అలాగే వాడుకలో ఉన్న బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం జరిగినట్లుగా ముందస్తుగానే నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.


పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నేరడిగొండ: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వాగ్ధారి గ్రామంలో స్వచ్ఛత హీసేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో శోభన, సర్పంచ్ గంగాదేవి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులున్నారు.

ఈ–పంచాయతీ ఆపరేటర్ల సమ్మెబాట

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ–పంచాయతీ ఆపరేటర్లు సమ్మెబాట పట్టారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈ–పంచాయతీ టెక్నికల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ, 13 ఏళ్లుగా పంచాయతీల్లో సాంకేతిక సేవలు అందిస్తున్న తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కనీస వేతనాల అమలుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో ఆపరేటర్లు పాల్గొన్నారు.

'సాత్నాల' గేట్ ఓపెన్



దిగువకు నీటి పరవళ్లు

జైనథ్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో చేరుతోంది. ఈ క్రమంలో అధికారులు శుక్రవారం ఒక గేట్ ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌లోకి 4000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 500 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగించారు. 1.24 టీఎంసీ నిల్వ సామర్థ్యం, 286.50 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్ కలిగిన ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 286.40మీటర్ల ఎత్తులో 1.20 టీఎంసీ నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

హామీలు.. ఆశలు

- ఎన్నికలు సమీపిస్తుండగా పార్టీల హడావుడి
- గ్యారంటీ స్కీమ్‌లపై కాంగ్రెస్ ప్రచార హోరు
- అభ్యర్థులు ఖరారైనా.. విడుదల కాని బీఆర్‌ఎస్ మేనిఫెస్టో
- 'ఫసల్ బీమా'పై బీజేపీ ఫోకస్



సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికలు సమీపిస్తుండగా రాజకీయ పార్టీలు హామీలను వల్లె వేస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా, మేనిఫెస్టో త్వరలో విడుదల చేయనుంది. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించకపోయినప్పటికీ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తుంది. కేంద్ర పథకాలను రాష్ట్రం కనిపించకుండా చేస్తోందని, ప్రజలకు సుదీర్ఘ కాలం ఉపయోగపడే విధంగా తమ పథకాలు ఉంటాయని బీజేపీ చెబుతోంది. ఇప్పటికే హామీలు, పథకాలు అంటూ ప్రజల్లోకి నాయకులు వెళ్తున్నారు. త్వరలో నోటిఫికేషన్ వచ్చే పరిస్థితి ఉండడంతో ఇది మరింత వేడెక్కుతోంది.

హస్తం.. విస్తృత ప్రచారం

కాంగ్రెస్ పార్టీ ఇటీవల తుక్కుగూడలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆరు గ్యారంటీ స్కీమ్‌లను ప్రకటించింది. వీటిని ఆ పార్టీ ఇప్పటికే ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ఒక ఫారంలో ఆ హామీలకు సంబంధించి ముద్రించి ఇంటింటికి తిరుగుతూ ఆ పథకాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల విషయంలో ఆరా తీస్తున్నారు. దాని ప్రకారం ఓ జాబితా తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన నివేదికను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి జిల్లాలో ఏయే పథకాలకు ఎవరు అర్హులనే విషయాన్ని స్పష్టం చేయడం జరుగుతుందని చెబుతున్నారు.


మేనిఫెస్టోపై 'కారు' హడావుడి..

సీఎం కేసీఆర్ త్వరలో విడుదల చేసే మేనిఫెస్టోపై బీఆర్‌ఎస్‌లో హడావుడి కనిపిస్తుంది. ప్రధానంగా సీఎం ప్రకటించే పథకాలతో ప్రతిపక్షాలకు దిమ్మతిరగడం ఖాయమనే భావన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతుంది. తాము కొనసాగిస్తున్న పథకాలనే కొంత పెంచి చెప్పడం ద్వారా ప్రతిపక్షాలు ఏదో చేయబోతున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు.

ఫసల్ బీమాపై 'కమలం' ధీమా

మహారాష్ట్ర తరహాలో రూపాయికే రైతులకు ఫసల్ బీమా యోజనను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రణాళిక బీజేపీ వద్ద ఉందని ఆ నేతలు చెబుతున్నారు. అంతే కాకుండా ఈనెల చివరిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లాలో పర్యటించనున్నట్లు పేర్కొంటున్నారు. దీంట్లో అన్నివర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడే పథకాలను ప్రకటించడం జరుగుతుందని నేతలు చెబుతున్నారు.

కాంగ్రెస్, బీజేపీవి కల్లబొల్లి హామీలే..



కాంగ్రెస్, బీజేపీవి కల్లబొల్లి హామీలే. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో హామీల అమలు ఎలా ఉందో ప్రజలందరికి తెలుసు. బీఆర్‌ఎస్ అమలు చేసే సంక్షేమ పథకాల విషయంలో ప్రజలకు విశ్వాసం ఉంది. మా పథకాలనే కాపీ కొడుతున్న ప్రతిపక్షాలు ఏదో చేస్తున్నామని చెప్పడం సరికాదు. మూడోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం.

– జోగు రామన్న, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

కేంద్ర పథకాలు విస్తృతంగా అందిస్తాం..



ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు లేని పేదల కోసం ఇంటి నిర్మాణం చేపడతాం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు అమలులో ఉన్నప్పటికీ, ఈ రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రజలకు చేరవేయకుండా కుతంత్రాలకు పాల్పడుతోంది. వచ్చే నెలలో ప్రధాన మంత్రి మోదీ జిల్లాకు రానున్నారు.

– పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

డేటా తయారు చేస్తున్నాం..



కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లను ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారు. ఇది ఓటు రూపంలో పార్టీ గెలుపునకు నాంది కానుంది. ఈ పథకాలకు సంబంధించి ఒక డాటా తయారు చేస్తున్నాం. లబ్ధిదారుల జాబితా తయారు చేసి అర్హులైన వారికి అందేలా మా ప్రయత్నం సాగుతోంది. మహాలక్ష్మి పథకంపై మహిళలు ఆసక్తి కనబర్చుతున్నారు.

–సాజిద్‌ఖాన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

టికెట్లపై తలో 'చేయి'

- కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న ఆశావహులు
- సిట్టింగ్ ఎమ్మెల్యేల రాకతో మారుతున్న పరిణామాలు
- జాబితా వెలువడే వరకు నాయకుల్లో ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎవరికి వారే అన్నట్లుగా ప్రచారం సాగిస్తున్నారు. ఆశావహులు తమకున్న మార్గాల్లో లాబీయింగ్ చేస్తూనే ఉన్నారు. పార్టీలో ఇంకా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు సాగుతూనే ఉంది. గాంధీ భవన్, ఢిల్లీ కేంద్రంగా ఎంపిక కమిటీలు, ప్రత్యేక బృందాలు తలమునకలై ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలకు మొత్తం 94 మంది టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు ఇటీవల పార్టీలో చేరిన వారు సైతం టికెట్లు ఆశిస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ ఆశావహుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఇప్పటికే నియోజకవర్గానికి మూడు పేర్లు చొప్పున పరిశీలనకు వెళ్లాయి. అధికార పార్టీ నుంచి అసంతృప్తులు, మాజీ ప్రజాప్రతినిధులు చేరడంతో జాబితా రూపకల్పనలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం లేకపోలేదు. రాష్ట్రం యూనిట్‌గా బీసీ, ఓసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలు, ఉప కులాలను లెక్కలోకి తీసుకున్నప్పుడు ఏ స్థానం ఏ సామాజిక వర్గానికి దక్కనుందోనని ఉత్కంఠ కొసాగుతోంది. దీంతో ఎవరికి వారే లాబీయింగ్ చేస్తున్నారు. పీసీసీతోపాటు ఏఐసీసీ వరకు మంతనాలు సాగిస్తున్నారు.

ఎవరికీ దక్కని హామీ

ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ ఎన్నికల వ్యూహ కమిటీ చైర్మన్‌గా కీలక హోదాలో ఉన్న మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)కు మంచిర్యాల టికెట్ ఖాయమని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఇక్కడ కేవీప్రతాప్‌తోపాటు బీసీ నాయకులున్నారు. చెన్నూరు నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి ఆశిస్తున్నారు. ఇదే స్థానానికి మాజీ మంత్రి బోడ జనార్దన్, డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఆయన సతీమణి విద్యావతి, డాక్టర్ రాజారమేశ్, ఓయూ విద్యార్థి నాయకుడు దుర్గం భాస్కర్, నేతకాని సంఘం నాయకుడు దుర్గం అశోక్, రామిళ్ల రాధిక తదితరులు టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. బెల్లంపల్లి నుంచి మాజీ మంత్రి గడ్డం వినోద్, చిలుముల శంకర్, నాతరీ స్వామితోపాటు మరో ఏడుగురు ఉన్నారు.

ఖానాపూర్, బోథ్‌లో మారిన సీన్

ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వైపు చూడడంతో ఒక్కసారిగా ఇక్కడ సీన్ మారింది. ఖానాపూర్ నుంచి రేఖానాయక్, ఆమె భర్త శ్యామ్‌నాయక్ ఆసిఫాబాద్ నుంచి ఇద్దరూ టికెట్లు ఆశిస్తున్నారు. ఒకవేళ సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇచ్చినా, తనకు కూడా ఇవ్వాలని శ్యామ్‌నాయక్ పట్టుబడుతున్నారు. ఢిల్లీలోనే లాబీయింగ్ చేస్తున్నారు. బోథ్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కాంగ్రెస్‌లో చేరితే, ప్రధాన పోటీ దారు కానున్నారు. ఇక్కడ 18మంది దరఖాస్తులు ఇచ్చారు. వీరిలో డాక్టర్ జాదవ్ నరేశ్, అడె గజేందర్ తదితరులు ఉన్నారు. నిర్మల్ నుంచి కూచాడి శ్రీహరిరావు, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు. సిర్పూర్‌లో రావి శ్రీనివాస్, ముధోల్‌లో షిండే ఆనంద్‌రావు, పి.విజయ్‌కుమార్‌రెడ్డితోపాటు మరో ఇద్దరున్నారు. ఈ నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థుల కోసం వేట కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పార్టీకి అవసరమైన చోట అధికార, విపక్ష పార్టీల నుంచి నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు మంత్రాంగం కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు తాజా, మాజీ ప్రజాప్రతినిధులతోనూ సంప్రదింపులు జరిపినట్లు సమాచారం.

నియామకం

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ గా భుక్తాపూర్ కౌన్సిలర్ బండారి సతీశ్ ను నియమిస్తూ ఫోరం రాష్ట్ర చైర్మన్ రామునాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫోరం నిబంధనల ప్రకారం పనిచేయాలని సూచిస్తూ బాధ్యతలు అప్పగించినట్లుగా పేర్కొన్నారు.

భిక్షాటనతో అంగన్‌వాడీల నిరసన



జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం వారు స్థానిక బస్టాండ్ ఎదుట భిక్షాటన చేస్తూ సర్కారు తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ, అంగన్‌వాడీలు 19 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు మధునిక, పార్వతి సుజాత, కవిత, ప్రియాంక, కళావతి బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు తుడుందెబ్బ మద్దతు



మద్దతు తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

ఉట్నూర్‌రూరల్: అంగన్‌వాడీల సమ్మెకు తుడుందెబ్బ మద్దతు ప్రకటించింది. ఇందులో భాగంగా శిబిరం వద్దకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి పుర్క బాపూరావు, మహిళా నాయకురాలు పుష్పరాణి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇందులో జిల్లా నాయకులు మనోజ్, శ్యాంరావు, దాందాస్ తదితరులున్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన



మాట్లాడుతున్న డీఎం కల్పన

ఆదిలాబాద్: ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి స్పందన లభించింది. ప్రయాణికులు పలు సమస్యలు, వినతులను డీఎం కల్పన దృష్టికి తీసుకురాగా, ఆమె వాటిని నమోదు చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వసంత్ అనే ప్రయాణికుడు అదిలాబాద్–బేల–సైద్‌పూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే సూచన మేరకు శుక్రవారం నుంచి బస్సు సౌకర్యం కల్పించినట్లు డీఎం వెల్లడించారు. బజార్‌హత్నూర్ నుంచి రాజన్న.. ఇచ్చోడ–సోనాల రూట్‌లో అదనపు బస్సు నడపాలని విన్నవించగా, ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉన్నందున వీలుపడదని డీఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నుంచి ఉత్తమ్ ఆదిలాబాద్–నిర్మల్ రూట్లో నాన్‌స్టాప్ సర్వీసు నడపాలని విజ్ఞప్తి చేయగా, విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు. ఇంద్రవెల్లి నుంచి మహేష్ ఉట్నూర్–హైదరాబాద్ రూట్లో బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, ప్రయాణికుల అధికంగా ఉన్న రోజుల్లో రిజర్వేషన్ అయిన సీట్ల సంఖ్య ఆధారంగా అదనపు సర్వీసులు నడుపుతామని తెలియజేశారు.

జోరు వాన

- ఉరుములు మెరుపులతో భారీ వర్షం
- పిడుగుపాటుకు ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వర్షం పడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో కుండపోతగా మొదలైన వర్షం తెరిపినిస్తూ సాయంత్రం 5 గంటల వరకు ఏకధాటిగా కురిసింది. చిరు వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లాలోని పలు మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరింది. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పిడుగు పాటుకు ఓ వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జైనథ్ మండలంలోని గూడ గ్రామంలో యాసీన్, అఫ్సానా దంపతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా పిడుగుపాటుకు యాసిన్‌తో పాటు వారి రెండు కాడెద్దులు అక్కడికక్కడే మృతిచెందగా భార్య అఫ్సానా తీవ్రంగా గాయపడింది. అలాగే బేల మండలంలోని తలైగూడ గ్రామంలో పిడుగుపాటుకు యశ్వంత్‌రావు అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు 108లో హుటాహుటిన జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గాదిగూడ మండలం బోటిగూడకు చెందిన రాథోడ్ శంకరిబాయి వ్యవసాయ పనుల్లో ఉండగా పిడుగు పడటంతో గాయాలయ్యాయి. ఆమెను కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. జైనథ్ మండలం బాలాపూర్ గ్రామంలో వాగు దాటుతుండగా నీటి ప్రవాహానికి ఎడ్లబండిలో వెళ్తున్న 65ఏళ్ల రౌతు రుక్మిణి బాయి అనే మహిళ కొట్టుకుపోయింది.

జిల్లా కేంద్రంలోనే అత్యధికం..

ఆదిలాబాద్ పట్టణంలో భారీ వర్షం కురిసింది. నాలుగు గంటల పాటు ఏకధాటిగా కురవడంతో 56.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సిరికొండలో 52 మి.మీ, బజార్‌హత్నూర్‌లో 36మి.మీ, జైనథ్‌లో 34.8మి.మీ, ఇచ్చోడలో 34.5మి.మీ, బోథ్‌లో 32.3మి.మీ, గుడిహత్నూర్‌లో 28.3మి.మీ, మావలలో 25.5మి.మీ, ఉట్నూర్‌లో 23.3మి.మీ, అదిలాబాద్ రూరల్ మండలంలో 18.5మి.మీ, ఇంద్రవెల్లిలో 6.3మి.మీ, గాదిగూడలో 5.8మి.మీ, నార్నూర్, భీంపూర్‌లో ఐదు, తాంసిలో 4.3 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.



జిల్లా కేంద్రంలో వర్షంలో ద్విచక్రవాహనదారుడు

విద్యుత్ వైర్లు తగిలి రైతు మృతి



కొమ్ము రాము మృతదేహం

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన కొమ్ము రాము (30) అనే యువ రైతు శుక్రవారం విద్యుత్ వైర్లకు తగిలి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో వర్షంతో పాటు ఈదురుగాలులు బీభత్సానికి ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. రాము తన పంట చేలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా పడిపోయిన విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు బోథ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు.

దళితబస్తీ అక్రమాలపై ఫిర్యాదు



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రూపేశ్‌రెడ్డి

కైలాస్‌నగర్: బేల మండలం పాటన్ గ్రామంలో దళితబస్తీ కింద పంపిణీ చేసిన భూముల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి ఆరోపించారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. పాటన్ గ్రామానికి చెందిన కాడే వర్ష అనే మహిళ ప్రభుత్వ అసైన్డ్ భూమిని తన భూమిగా దళిత బస్తీ పథకంలో విక్రయించారన్నారు. 3 ఎకరాలకు గాను ప్రభుత్వం ఆమెకు రూ.15 లక్షలు చెల్లించిందన్నారు. దీంతో సర్వేనంబర్ 32/2లో గల ఆ భూమిని కొబ్బాయి గ్రామానికి చెందిన లబ్ధిదారు కొంద్రావార్ రేఖబాయికి అధికారులు కేటాయించారన్నారు. అయితే ఆ భూమి అసైన్డ్‌ది కావడంతో పట్టా కావడం లేదని లబ్ధిదారుకు రైతుబంధు, రైతు బీమాతో పాటు ఇతర పథకాలు అందడం లేదని వివరించారు. విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే ఇది అసైన్డ్ భూమి అంటూ అధికారులు సమాచారం ఇచ్చారన్నారు. ఈ విషయం మండల రెవెన్యూ అధికారికి తెలిసినా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి అక్రమాల్లో భాగం పంచుకున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని లబ్ధిదారుకు న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

నిజాయతీ చాటిన కండక్టర్

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్సులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితురాలికి ఫోన్ అందజేసి కండక్టర్ కేజీ రామ్ నిజాయతీ చాటుకున్నాడు. నిజామాబాద్ నుంచి నిర్మల్ వస్తున్న బస్సులో ఎక్కిన మహిళ శుక్రవారం సెల్ ఫోన్ మరిచిపోయి పోచంపాడ్ ఎక్స్‌రోడ్ వద్ద దిగిపోయింది. ఇది గుర్తించిన కండక్టర్ ఆ సెల్‌ఫోన్‌ను స్టేషన్ మేనేజర్‌కు అందజేశారు. అనంతరం బాధితురాలికి బస్టాండ్‌లో ఆ ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా డీఎం ప్రతిమారెడ్డి కండక్టర్‌ను అభినందించారు.

ఢిల్లీ బయల్దేరిన సర్పంచుల బృందం

నార్నూర్: నీతి ఆయోగ్‌లో భాగంగా మూడు రోజుల శిక్షణ నిమిత్తం శుక్రవారం ఎంపీపీ, ఎంపీడీవో, సర్పంచులు ఢిల్లీకి బయల్దేరారు. అంతకుముందు జెడ్పీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా, డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్‌ను కలిశారు. అక్కడి నుంచి నేరుగా ఢిల్లీకి పయనమయ్యారు. బృందంలో ఎంపీపీ కనక మోతుబాయి, ఎంపీడీవో రమేశ్, సర్పంచులు బానోత్ గజానంద్‌నాయక్ (నార్నూర్), ఉర్వేత రూప్‌దే (గంగాపూర్), రాథోడ్ సావీందర్ (మాన్కాపూర్), రాథోడ్ విష్ణు (భీంపూర్), రాథోడ్ గోవింద్ (ఎంపల్లి) ఉన్నారు. మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో వారిని అభినందించారు.

అర్చకులకు రేపటి నుంచి శిక్షణ తరగతులు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ధూప దీప నైవేద్య అర్చకులకు అక్టోబర్ 1నుంచి 3వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ నవీన్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. వైదిక స్మార్త, శైవ, పాంచరాత్ర, వీరశైవ, చాత్తాద శ్రీవైష్ణవ, గ్రామ దేవత ఆగమములకు సంబంధించిన శిక్షణ తరగతులను నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులకు భోజన సదుపాయం సైతం ఉంటుందని పేర్కొన్నారు. వైదిక స్మార్త, శైవ ఆగమములకు చెందిన అర్చకులకు అక్టోబర్ 1న, పాంచరాత్ర, వీరశైవ అర్చకులకు 2న, చాత్తాద శ్రీవైష్ణవ, గ్రామ దేవత ఆగమములకు చెందిన వారికి 3న శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. విషయాన్ని అర్చకులు గమనించి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జ్వరంతో గిరిజన యువతి మృతి


గంగుబాయి (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: జ్వరం బాధపడుతూ గిరిజన యువతి గంగుబాయి (23) మృతిచెందింది. మండలంలోని ఎర్రగుట్ట గ్రామానికి చెందిన భొజ్జు-అయ్యుబాయిల దంపతుల కూతురు గంగుబాయి గతవారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. జ్వరం తీవ్రం కావడంతో శుక్రవారం తెల్లవారుజాము మృతిచెందింది. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు నాయకులు కోరారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఐటీ మంత్రి కేటీఆర్ మొట్ట మొదటిసారిగా ఆదివారం విచ్చేస్తున్న చెన్నూర్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ అశోక్‌యాదవ్ పిలుపునిచ్చారు. గుడిపేటలోని పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు యాదవులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

క్యాంపస్ నుంచే కొలువు

- ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు రూ.15లక్షల వార్షిక వేతనం


బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా(ముధోల్): శరవేగంగా విస్తరిస్తున్న సాంకేతిక రంగంలో బాసర ట్రిపుల్‌ఐటీ ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు బాటలు వేస్తోందని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. ప్లేస్‌మెంట్‌లో రాణించిన కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులను అభినందించారు. ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు కామెర ప్రణవ్, మహమ్మద్ అమ్రాట్‌లకు రూ.15లక్షల వార్షిక వేతనం ఇస్తూ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇచ్చారు. హంగో సేవ్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎంపికైన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా నెలకు రూ.35 వేలు అందించనుంది. అనంతరం రూ.15 లక్షల రూపాయల వార్షిక వేతనం ఇవ్వనున్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ సతీశ్ కుమార్ అభినందించారు.

నిరుపేద కుటుంబం



మాది పెద్దపల్లి జిల్లా రామగుండం. నా తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ నన్ను చదివించారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నా. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఎంపికయ్యా. రూ.15లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నారు. కష్టపడి చదివినందుకు ప్రతిఫలం దక్కింది.

– కామెర ప్రణవ్, ట్రిపుల్‌ఐటీ విద్యార్థి

కష్టపడి చదివించారు



నిజామాబాద్‌కు చెందిన నేను ఎంతో కష్టపడి చదివా. మాతల్లి గృహిణి. తండ్రి మటన్ షాపు నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నా చదువు కోసం ఎంతగానో కష్టపడ్డాడు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లోఎంపిక కావడం ఎంతో ఆనందాన్నిస్తోంది. కష్టపడి చదివిన ప్రతీ ఒక్కరికి అవకాశాలు వస్తాయి.

– మహమ్మద్ అమ్రాట్, ట్రిపుల్‌ఐటీ విద్యార్థి

కమ్యూనికేషన్ స్కిల్స్ కీలకం



జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్‌లలో ఉండే కోర్సులను బాసర ట్రిపుల్‌ఐటీ అందిస్తోంది. కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లభాషా నైపుణ్యం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తాయి. విద్యార్థులకు అమెరికా, ఆస్ట్రేలియా, న్యూ జిలాండ్ వంటి దేశాల్లో అవకాశాలు లభిస్తున్నాయి.

– వెంకటరమణ, బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ

అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దు

- డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరి రావు

నిర్మల్‌చైన్‌గేట్: అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను నమ్మవద్దని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు కోరారు. సారంగాపూర్ మండలం వైకుంఠాపూర్, ధని, బోరిగాం, సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్, గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని మోసపూరిత హామీలతో సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారని తెలిపారు. వారికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. అసమర్థ మంత్రి ఇప్పటివరకు సారంగాపూర్ మండలంలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించలేదని విమర్శించారు. దళితబంధు పథకాన్ని అందిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటివరకు ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కలలు సాకారం చేసిన సోనియాగాంధీ ఆరు గ్యారెంటీ స్కీంలు ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి రాగానే వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు సాద సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ నర్సయ్య, రొడ్డ మారుతి, రామ్‌రెడ్డి, ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు నక్క మధుకర్‌రెడ్డి, దినేశ్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

బాసర ఆలయంలో మాస పూజలు


పూజలు చేస్తున్న వేదపండితులు

భైంసా(ముధోల్): బాసర సరస్వతీ అమ్మవారికి పౌర్ణమి రోజున మాస పూజలు నిర్వహించారు. శుక్రవారం భాద్రపద పౌర్ణమి సందర్భంగా చతుర్వేద సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, కలశస్థాపన, రక్షాబంధనం, మండపారాధనతో పాటు పలు పూజలు నిర్వహించారు. ప్రతీనెల పౌర్ణమి సందర్భంగా ఆలయంలో మాస పూజలు నిర్వహిస్తారు.

ప్రాజెక్టు మేనేజర్లకు పేస్కేల్ అమలు చేయాలి


శాంతియుత సమ్మెలో ఈ పంచాయతీ ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాస్థాయిలో పని చేస్తున్న 32 ప్రాజెక్ట్ మేనేజర్లకు పేస్కేల్ అమలుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ విద్యాసాగర్ కోరారు. తెలంగాణ ఈ పంచాయతీ టెక్నికల్ వింగ్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(ఈ పంచాయతీ) ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు శాంతియుత సమ్మె నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం ఇచ్చారు. అక్కడినుంచి నేరుగా సమ్మె స్థలానికి చేరుకొని సమ్మె చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతు ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేసి ప్రత్యేక గ్రాంట్ ద్వారా వేతనం చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా, ఆరోగ్య భద్రతను కల్పించాలని, ఉద్యోగులలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్ని వసతులను, సహకారాలను అందించాలన్నారు. కార్యక్రమంలో కె.సునీల్, అశ్విన్, విజయశ్రీ, శిరీష, రాజ్యలక్ష్మి, ఈ-పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్ట్‌లపై లేదు

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వెడ్మ బొజ్జు


వరద గేటును పరిశీలిస్తున్న నాయకులు

కడెం: రాష్ట్ర ప్రభుత్వానికి కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్ట్‌లపై లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ఆరోపించారు. శుక్రవారం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించి, మరమ్మతు పనులను పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసి, ఆయకట్టుకు రైతాంగానికి రెండు పంటలకు నీరందించాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు వాజీద్‌ఖాన్, బబ్లూ, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

వాగులో కొట్టుకుపోయి వృద్ధురాలి మృతి

- పూజ అనంతరం ఇంటికి వస్తుండగా ప్రమాదం


రుక్మిణబాయి

జైనథ్: మండలంలోని బాలాపూర్ గ్రామానికి చెందిన రౌత్ రుక్మిణ బాయి(61) అనే వృద్ధురాలు వాగులో కొట్టుకుపోయి మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రుక్మిణబాయి శనివారం సాయంత్రం గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న దత్త మందిరంలో స్థానికులతో కలిసి పూజాది కార్యక్రమాలకు వెళ్లింది. పూజ అనంతరం భోజనాలు చేసి, ఇంటికి తిరుగు పయనమైంది. ఈ క్రమంలో వర్షం ప్రారంభం కావడంతో అటుగా వచ్చిన ఎడ్లబండి ఎక్కింది. అయితే దత్త మందిరం వద్ద ఉన్న వాగును ఎడ్లబండి దాటే క్రమంలో ఒక్కసారిగా ఎడ్లు వాగులోకి జారిపోయాయి. దీంతో వా గులో పడిపోయిన ఆరుగులు కేకలు వేశారు. స్థాని కులు వచ్చి వాగులో దూకి, అందరిని బయటకు తీ శారు. కాగా రుక్మిణబాయి వాగులో నీటిప్రవాహాని కి కొట్టుకుపోయింది. అష్టకష్టాలు పడి ఆమెను రక్షించగా అప్పటికే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కి తరలించారు.

భార్య హాస్పిటల్‌కు.. భర్త మార్చురీకి

- కుటుంబాన్ని ఛిద్రం చేసిన పిడుగుపాటు
- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు
- రెండు ఎడ్లు సైతం మృతి


చికిత్స పొందుతున్న అఫ్సానా


మార్చురీలో యాసిన్ మృతదేహం

జైనథ్: పిడుగుపాటు ఓ కుటుంబాన్ని ఛిద్రం చేసేసింది. చేను చెలక, ఇద్దరు పిల్లలతో సంతోషంగా కాలం వెళ్లదీస్తున్న ఓ కుటుంబం పిడుగుపాటుతో రోడ్డున పడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గూడ గ్రామానికి చెందిన షేక్ యాసిన్(41), షేక్ అఫ్సానా దంపతులు. వీరికి రియాన్(14), సానియా (12) ఉన్నారు. యాసిన్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. తనకున్న మూడెకరాల్లో ఈ ఏడాది పత్తి వేశాడు. శుక్రవారం భార్యతో కలిసి ఎడ్లబండిపై చేనుకు వెళ్లి, పత్తిలో పురుగుల మందు పిచికారి చేస్తుండగా, మధ్యాహ్న వర్షం మొదలైంది. ఇంటికి తిరిగి వెళ్లేందుకు యాసిన్ ఎడ్లబండిని సిద్ధం చేయసాగాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో రెండు ఎడ్లు, యాసిన్ అక్కడికక్కడే చనిపోగా, కొద్ది దూరంలో అఫ్సానా స్పృహ కోల్పోయింది. గమనించిన చుట్టుపక్కల రైతులు సంఘటన స్థలానికి వెళ్లి అఫ్సానాను రిమ్స్‌కి తరలించారు. యాసిన్ మృతదేహం పోస్టుమార్టం కోసం రిమ్స్‌కి తరలించారు.

ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు

అఫ్సానా తలకు గాయాలు కావడంతో ఆమెను కుటుంబీకుల రిమ్స్ నుంచి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతుండగా బీపీ తరచూ మారుతుండటంతో భర్త చనిపోయిన విషయాన్ని ఆమెకు కుటుంబీకులు చెప్పలేదు. స్పృహలోకి వచ్చిన ఆమె తన భర్త ఎక్కడ అని అడగగా, గాయాలతో వేరే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని రేపు ఉదయం వెళ్లి చూడవచ్చని సర్దిచెప్పారు. అయితే భారీ వర్షానికి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించడానికి ఆస్కారం లేకపోవడంతో శవాన్ని మార్చురీలో ఉంచారు. శనివారం పోస్టుమార్టం చేయాలని కుటుంబీకులు వైద్యులను కోరారు.

భారీ వర్షం

బోథ్: మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. సొనాలలో పిడుగులతో కూడిన వర్షం కురిసింది. సొనాలలో చెట్టుపై పిడుగుపడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కాగా, ఐదు పిడుగులు పడటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

పిడుగుపాటుకు ఒకరికి తీవ్రగాయాలు


గాయాలపాలైన యశ్వంత్‌రావు

బేల: పిడుగుపాటుకు ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మోహన్‌రావుగూడకు చెందిన రైతు యశ్వంత్‌రావుకు శుక్రవారం సాయంత్రం వర్షం కురుస్తుండగా పిడుగుపాటుకు గురయ్యాడు. తన భార్య సంగీతతో కలిసి మండలంలోని తలాయిగూడ శివారులోని పొలం పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఎడ్లబండిపై ఒకవైపు పిడుగుపడింది. ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతోపాటు యశ్వంత్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య ఎడ్లబండి వెనుకాల కాలినడకన కొంతదూరంలో ఉండడంతో ఆమెకు ప్రమాదం తప్పింది. కాగా, 108 ఈఎంటీ సాయి తేజ, పైలెట్ సత్యనారాయణలు తీవ్ర గాయాలపాలైన యశ్వంత్‌రావును ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

కడెంను సందర్శించిన న్యూజిలాండ్ వాసులు


హరిత రిసార్ట్స్ వద్ద న్యూజిలాండ్ దేశస్తులు

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్, పరిసర అటవీ ప్రాంతాలను శుక్రవారం న్యూజిలాండ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు సందర్శించారు. ఇండియాలో పర్యాటక ప్రదేశాలను చూసేందుకు తాము వచ్చామని, అందులో భాగంగానే కడెంను సందర్శించినట్లు తెలిపారు. కడెం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల ప్రకృతి అందాలు బాగున్నాయన్నారు. రెండు రోజుల పాటు మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో విడిది చేయనున్నట్లు తెలిపారు.

కడెంకు కొనసాగుతున్న మరమ్మతు


పనులు పర్యవేక్షిస్తున్న ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్

కడెం: కౌంటర్ వెయిట్ విరిగి దెబ్బతిన్న కడెం ప్రాజెక్ట్ 15వ, నంబర్ వరద గేటుకు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం సుమారు ఫీట్ మేర గేటును కిందకు దించగా, జాకీలు మొరాయించింది. శనివారం పూర్తిస్థాయిలో గేటుకు కిందకు దించనున్నట్లు ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 697.850 అడుగుల నీటిమట్టం ఉంది. ప్రాజెక్ట్‌కు 2373 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 15 నంబర్ గేటు ద్వారా 1523 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

భూతగాదాలతో వ్యక్తిపై దాడి


మల్లయ్యను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: భూతగాదాలతో అన్న తమ్ముడిపై దాడి చేసి ఘటన మండలంలోని మల్లాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సిలారి పెద్ద మల్లయ్య, చిన్న మల్లయ్య అన్నదమ్ములు. గత ఆరేళ్లుగా భూముల విషయంలో గొడవ పడుతున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద భూమి విషయంలో చిన్నమల్లయ్య భార్య గంగవ్వతో పెద్ద మల్లయ్యకు గొడవ జరిగింది. చేను నుంచి ఇంటికి వచ్చిన భర్తకు గొడవ విషయం చెప్పింది. ఎందుకు గొడవ లని అన్నతో తమ్ముడు అన్నాడు. ఈ క్రమంలో పెద్ద మల్లయ్య, అతని కుమారుడు మహేశ్ కలిసి ఇనుప రాడ్, కత్తులతో అతనిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. చిన్నమల్లయ్య తలపై తీవ్ర గాయాలై రక్తపు మడుగులో ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఏఎస్సై గంగాధర్, పీసీలు సునీల్, గణేశ్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పోలీస్ వాహనంలో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గంగవ్వ ఫిర్యాదుతో పెద్ద మల్లయ్య, మహేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సమ్మెలో కార్మికులు.. టీచర్ల వంట


సమ్మెలో కుర్చున్న మధ్యాహ్న భోజనం కార్మికులు

తానూరు: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మధ్యాహ్న భోజనం కార్మికులు గత రెండు రోజులుగా సమ్మెబాట పట్టారు. శుక్రవారం ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు వంట చేసి ఆరగించారు. ఎల్వి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు వంట చేయగా, తానూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు టీచర్లు భోజనం వడ్డించారు.


తానూరు పాఠశాలలో..


ఎల్వి పాఠశాలలో వంట చేస్తున్న టీచర్

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


లక్ష్మణ్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జాదవ్ లక్ష్మణ్ (53) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజాము మృతిచెందారు. జిల్లాలోని బేల ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. రెండు నెలల క్రితం గుండెకు సంబంధించిన వైద్య చికిత్స చేయించుకుని స్వగ్రామంలో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి గుండెనొప్పి రావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్, ఎంపీపీ రాథోడ్ సజన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు గ్రామానికి చేరుకుని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రముఖ హాకీ శిక్షకుడు మృతి


మల్లేశ్ (ఫైల్)

ఆదిలాబాద్: జిల్లాలో హాకీ క్రీడా ప్రాచుర్యానికి విశేష కృషి చేసిన రిటైర్డ్ పీడీ, జిల్లా వాసి ప్రముఖ హాకీ శిక్షకుడు ఎస్. మల్లేశ్ (69) గుండెపోటుతో కన్నుమూశారు. గురువారం రాత్రి ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి జిల్లా క్రీడా రంగానికి తీరని లోటని జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్దన్ రెడ్డి, కోరెడ్డి పార్థసారధి, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ముధోల్: మండల కేంద్రంలోని బాసర-భైంసా ప్రధాన రహదారిలో స్థానిక పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. బాసర వైపు నుంచి భైంసా వైపు బైక్‌పైవెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు, గ్రామస్తులు ప్రైవేటు వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, బాధితుడికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియరాలేదు.